నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, శనివారం 20 జనవరి 2024 | HYDERABAD

తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌ను శుక్రవారం శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ప్రమాదమని తెలిసినా
ఫ్లై ఓవర్‌పై ఊడ్పిస్తున్నారు

స్వీపింగ్ యంత్రాలను పక్కన పెట్టి శానిటేషన్ వర్కర్లతో పనులు

సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌పై శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇరువైపులా వాహనాల రద్దీ ఉండగానే ప్రమాదకరంగా జీహెచ్ఎంసీ కార్మికులతో ఫ్లైఓవర్‌ను శుభ్రం చేయించారు. వాస్తవానికి ఫ్లై ఓవర్లపై స్వీపింగ్ మిషన్లతో పరిశుభ్రత చర్యలు చేపట్టాల్సిన బల్దియా కార్మికులకు రక్షణ చర్యలు లేకుండా ప్రాణాలను ఫణంగా పెట్టి వెట్టి చేయిస్తుందనడానికి ఇదో మచ్చుతునక. మీరెందుకు ఊడుస్తున్నారని కార్మికులను ప్రశ్నిస్తే రెండు, మూడు రోజులకొకసారి మేమే ఈ ఫ్లై ఓవర్ పరిశుభ్రత పనులు చేస్తామని, కమిషనర్ వస్తున్నాడని చెబితే ఈ పనులు చేస్తున్నట్లు సర్కిల్-15 (ముషీరాబాద్)కు చెందిన ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు చెప్పడం కొసమెరుపు. ఈ విషయంపై శానిటేషన్ విభాగం అదనపు కమిషనర్ ఉపేందర్ రెడ్డిని ఫోన్‌లో వివరణ కోరే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. **- సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ)**

వనంలోని ప్రాణి.. జనంలో శిల్పమై.. నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరా గార్డెన్‌లో ఆకట్టుకుంటున్న జింక ఆకృతి శిల్పాలు

• పట్టణ ప్రణాళికపై హెచ్ఎండీఏ సమీక్ష

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ చుట్టూ పెరుగుతున్న పట్టణీకరణపై హెచ్ఎండీఏ పట్టణ ప్రణాళిక విభాగం ఫోకస్ పెట్టింది. ఎన్నికల్లో నేపథ్యంలో రెండు నెలలుగా భవన నిర్మాణాల అనుమతులు, భూ వినియోగ మార్పిడికి సంబంధించిన అనుమతులు నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రణాళిక విభాగానికి వచ్చే దరఖాస్తుదారుల సంఖ్య పెరిగింది. అదేవిధంగా ఎల్ఆర్ఎస్, సీఎల్యూ వంటి పనుల కోసం ప్రజలు అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయానికి వచ్చి వెళుతున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణాల అనుమతులు, మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా కల్పించాల్సిన మౌలిక వసతులు, భూ వినియోగ మార్పిడి వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిశోర్ లండన్ పర్యటనలో ఉండడంతో సమావేశానికి సంబంధించిన నివేదికను ప్రత్యేకంగా ఆయనకు అందజేయనున్నారు. హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిశోర్ పూర్తి స్థాయిలో సమీక్షించి, పట్టణ ప్రణాళిక అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు.

నేడు, రేపు ఓటు నమోదు

ఓటరు సవరణకూ అవకాశం

వచ్చే నెల 8న తుది జాబితా

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు నేడు (శని), రేపు (ఆదివారం) అన్ని జోనల్, సర్కిల్ కార్యాలయాలు, వార్డు ఆఫీసుల వద్ద ప్రత్యేక ఓటరు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఓటరు నమోదు, సవరణ దరఖాస్తులను బూత్ లెవెల్ పోలింగ్ అధికారులు స్వీకరించనున్నారు. ఈ నెల 6న విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులను తెలిపే గడువు ఈ నెల 22తో ముగియనుందని చెప్పారు. నూతన ఓటరు నమోదు తోపాటు, డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను తొలగించి ఫిబ్రవరి 8న తుది జాబితాను ప్రకటిస్తారని అధికారులు తెలిపారు.

అదిరింది విన్యాసం
మురిసింది గగనం

రెండోరోజూ ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న వింగ్స్ ఇండియా - 2024 ఎగ్జిబిషన్ శుక్రవారం రెండో రోజు సందర్శకులతో కిటకిటలాడింది. ఆకాశవీధిలో హెలీకాప్టర్ల విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, సందర్శకులు విమానాలను చూసి సంబురపడ్డారు. హెలీకాప్టర్లు, భారీ బోయింగ్ విమానాల వద్దకు చేరుకుని సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ మురిసిపోయారు.

భూ అక్రమాల సూత్రధారి
కాంగ్రెస్ నాయకుడే

జీవో 59 అడ్డుపెట్టుకుని అవకతవకలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, జనవరి 19 : నానక్‌రాంగూడ 149 సర్వేనెంబర్‌లో జీవో 59ను అడ్డుపెట్టుకొని జరిగిన అవకతవకల్లో ప్రధాన సూత్రధారి గోపన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పీ.సురేందర్ అని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం సర్వేనెంబర్ 149లోని అక్రమంగా రెగ్యులరైజ్ చేసిన 7 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువ జేసే ప్రభుత్వ స్థలాన్ని కాంగ్రెస్ నాయకుడు సురేందర్ అతని భార్య, కుటుంబ సభ్యులు, బినామీల పేర్ల మీద రెగ్యులరైజ్ చేసుకున్నాడని చెప్పారు. 6 గంటలకు కన్వెన్స్ డీడ్ రిజిస్ట్రేషన్లు కావడం, మళ్లీ 7: 30 గంటలకు ఇతరుల పేరు మీద (కొన్ని నిర్మాణ సంస్థలు) రిజిస్ట్రేషన్లు చేశారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా పక్కా పథకంతో నడిపించారని, ఆధారాలు, డాక్యుమెంట్లు మీడియా ముందుకు తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ వ్యవహారానికి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి, కాంగ్రెస్ నాయకుడు పల్లపు సురేందర్, ఇతర వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ డిమాండ్ చేశారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యేలకు ప్రమేయం ఉన్నట్లు ఓ పత్రికలో (నమస్తే తెలంగాణ కాదు) తప్పుడు కథనాలు ప్రచురితం చేయడాన్ని ఆయన ఖండించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ భూ తతంగంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

నానక్‌రాంగూడ సర్వేనెంబర్ 149 ప్రభుత్వస్థలాన్ని పరిశీలించి ఆధారాలు చూపిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కేటుగాళ్లతో జాగ్రత్త

నల్లా, కరెంట్ మీటరుకు డబ్బు లివ్వండంటూ ఇండ్ల లబ్ధిదారులకు ఫోన్లు

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులకు కేటుగాళ్లు టోకరా వేస్తున్నారు. వెబ్‌సైట్‌లో లబ్ధిదారుల డేటా సేకరించి, మీకు నల్లా కనెక్షన్, కరెంట్ మీటర్ ఇప్పిస్తామని ఫోన్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. నల్లా కనెక్షన్‌కు రూ. 1250లను యూపీఐ ద్వారా చెల్లించాలని కుచ్చుటోపీ పెడుతున్నారు. రెండు రోజులుగా 72960 57957, 7463086318 నంబర్ల నుంచి లబ్ధిదారులకు కాల్స్ వస్తున్నాయని, ఇటువంటి కేటుగాళ్ల బారిన పడొద్దని పోలీస్‌లు, జీహెచ్ ఎంసీ అధికారులు చెబుతున్నారు.

రైతుకు మంట.. వ్యాపారికి పంట

మలక్‌పేట మార్కెట్‌లో మిర్చి రైతులకు శరగోపం

అధికారుల నిర్లక్ష్యం.. వ్యాపారుల ఇష్టారాజ్యం

సైదాబాద్, జనవరి 19 : మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ అధికారుల నిర్లక్ష్య వైఖరి, వ్యాపారుల, దళారీల ఇష్టారాజ్య దోపిడీ కారణంగా మిర్చి రైతుకు మద్దతు ధరలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మలక్‌పేట మార్కెట్‌కు ఈ సీజన్‌లో సుమారు వంద రోజుల పాటు మిరప క్రయ , విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో ఇప్పటి వరకు 84,053 బస్తాల మిర్చి వస్తే, గత ఏడాది జనవరి 19 వరకు నాటికి 44,091 బస్తాలే వచ్చాయి. శుక్రవారం రికార్డు స్థాయిలో 8,991 బస్తాలు వచ్చాయి. రోజుకు దాదాపు 4 వేల నుంచి 6 వేల వరకు మిర్చి బస్తాలు విక్రయానికి వస్తున్నాయి. గత ఏడాది నాణ్యమైన తేజరకం మిర్చి క్వింటా ధర 23 వేలు ఉండగా, కనిష్ట ధర రూ. 14వేలు పలికింది. ప్రస్తుతం మిర్చి క్వింటా ధర గరిష్టంగా రూ. 20 వేలు పలుకగా, కనిష్ట ధర రూ. 4వేలు మాత్రమే పలికింది. అధికారుల పర్యవేక్షణ లేక పోవటంతో వ్యాపారులు చేతితో మిర్చి నాణ్యతను పరిశీలించి ధర నిర్ణయిస్తున్నారు. మార్కెట్లలో వ్యాపారుల, దళారీ వ్యవస్థలను రూపుమాపడానికి కేసీఆర్ ప్రభుత్వం తేమ శాతం నిర్ధారించడానికి ఆధునిక యాంత్రాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, జీపీఆర్ఎస్ కాంటాలు, క్రయ, విక్రయాల్లో ఈ-నామ్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. అయినప్పటికీ వ్యాపారులు యంత్రాలను వినియోగించకుండా పాత మూస పద్ధతులనే అవలంబిస్తూ మిర్చి రైతులకు శరగోపం పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

నచ్చిన ధరకే విక్రయించాలి

గత ఏడాది కంటే మిర్చి దిగుబడి పెరగటంతో ధరలు తక్కువ ఉన్న మాట వాస్తవమే. తేమ నిర్ధారణ యంత్రం అందుబాటులోనే ఉంది. రైతులే నేరుగా వినియోగించుకోవచ్చు. రైతులు తమకు నచ్చిన ధరలకే విక్రయించాలని, లేకుంటే సరుకు తీసుకెళ్లి మంచి ధర ఉన్నప్పుడే విక్రయించే విధంగా ప్రతి రోజు మైక్‌ల ద్వారా జాగ్రత్తలు, సూచనలు చేస్తున్నాం. **- దామోదర్, మలక్‌పేట మార్కెట్ సెకండరీ గ్రేడ్ అధికారి.**

గతి లేక అమ్ముకుంటున్నాం

ఎంతో కష్టపడి పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించటం లేదు. సరుకు ఎక్కువగా వచ్చిందని వ్యాపారులు ధరలు పెట్టడంలేదు. ఎన్నో ఇబ్బందులు పడి తెచ్చిన పంటను వెనక్కు తీసుకెళ్లలేక.. గతి లేక అమ్ముకొని వెళ్లి పోతున్నాం.

- శేషన్న, రైతు, కొండపల్లి, జోగులాంబ గద్వాల జిల్లా

మలక్‌పేట మార్కెట్‌కు వచ్చిన మిర్చి

గ్రేటర్ @ 30 డిగ్రీలు

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : అగ్నేయం నుంచి తెలంగాణ రాష్ట్రం వైపునకు వీస్తున్న గాలుల ప్రభావంతోనే నగరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ క్రమంలో వారం రోజులుగా నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి నమోదవుతున్నాయి. ఫలితంగా ఉక్కపోత తప్పడం లేదు. శుక్రవారం నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.2 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 41శాతంగా నమోదైనట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

కేక్ కట్ చేయించలేదని..
రైలు కిందపడ్డాడు

బాలికపై కత్తితో దాడి చేసిన బాలుడు ఆత్మహత్య

రమణ (ఫైల్)

గోల్నాక, జనవరి 19 : అంబర్‌పేటలో ఘోరం జరిగింది. బర్త్ డే కేక్ కట్ చేయించలేదని బాలికపై ఓ బాలుడు కత్తితో దాడి చేసి, ఆపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట తురాబ్‌నగర్‌కు చెందిన అంజయ్య కుమారుడు రమణ(16) మల్లిఖార్జుననగర్‌కు చెందిన ఓ బాలిక(16) పదోతరగతిలో క్లాస్‌మేట్స్. ప్రస్తుతం వేర్వేరు కాలేజీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. కొన్ని రోజులుగా ప్రేమ పేరుతో బాలిక వెంటపడుతున్న బాలుడు శుక్రవారం తన పుట్టిన రోజు కావడంతో, గురువారం రాత్రి తన ముందు కేక్ కట్ చేయాలనుకున్నాడు. ఇందుకు బాలిక ఒప్పుకోకపోవడంతో కత్తితో దాడి చేశాడు. అడ్డొచ్చిన బాలిక సోదరిని కూడా గాయపర్చి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం విద్యానగర్ రైలు పట్టాలపై బాలుడి మొండెంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి జరిగిన ఘటనపై భయాందోళనతో ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి, అక్రమాలను
సహించను

జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : రెండు రోజులుగా సీ అండ్ డీ (భవన నిర్మాణ) వ్యర్థాలు, పారిశుద్ధ్య నిర్వహణపై ఆరుగురు జోనల్ కమిషనర్లతో కమిషనర్ రొనాల్డ్ రాస్ సమీక్షలు జరుపుతున్నారు. ప్రమాదకరంగా భవన నిర్మాణ వ్యర్థాలను తరలింపు, అక్రమంగా నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌ను అరికట్టడంతో పాటు రోజూ డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీర్లు, ఏఎంవోహెచ్‌ల పనితీరుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో కొన్ని జోనల్ కార్యాలయాల్లో లోపాలు ఉన్నాయని జోనల్ కమిషనర్లకు సూచించారు. ఇంటింటి చెత్త సేకరణలో స్వచ్ఛ ఆటోల పనితీరుపై పర్యవేక్షణ ఉండడం లేదని, రోజు దాదాపు వెయ్యి ఆటోల వరకు అటెండెన్స్ ఉండడం లేదని, ఈ విషయంలో జోనల్ కమిషనర్లు దృష్టి సారించాలని సూచించారు. జోనల్ కార్యాలయాల సేవలు పకడ్బందీగా జరపాలని పేర్కొంటూనే, నగరం నడిబొడ్డున ఉన్న ఓ జోనల్ కమిషనర్‌కు కమిషనర్ రొనాల్డ్ రాస్ తనదైన శైలిలో చురకలు అట్టించినట్లు తెలుస్తోంది. అవినీతి, అక్రమాలపై సీరియస్ యాక్షన్ ఉంటుందని, జాగ్రత్తగా విధుల్లో అంకితభావంతో పనిచేయాలని కమిషనర్ మందలించినట్లు సమాచారం.